అనగనగా ఒకరాజు. ఆయనకి ముగ్గురు కూతుళ్ళు. వారికి పెళ్ళీడు వచ్చింది. ఒకరోజు మహారాజు మంత్రిని పిలిచి "అమ్మాయిలకు మంచి వరుళ్ళని వెదకండి. అల్లుళ్ళలో ఎవరు యోగ్యులో వారే నా తరువాత మహారాజవుతాడు" అన్నాడు.

రాజుగారి పెద్ద కూతుళ్ళకు అహంకారమెక్కువ. అందరి మీద దర్పం చూపేవారు. చిన్నకూతురు పేరు కాంతిసేన. ఆమె చక్కని చుక్క. మంచితనం ఆమె సొత్తు. చెలికత్తెలతో కూడా స్నేహంగా వుండేది. పల్లెత్తుమాట అనేది కాదు. పెద్ద కూతుళ్ళకు రాజు పెళ్ళి చేశాడు. అల్లుళ్ళు వచ్చారు.

# కాంతిసేన

పెనిగిలపాటి రాహుల్



వాళ్ళు రాజుగారికి అంతగా నచ్చలేదు. ఇక ఆయన ఆశలన్నీ కాంతిసేనకు వచ్చే వరుడిపైనే.

చిన్నకూతురు కాంతిసేనను పిలిపించి "అమ్మా నీకు పెళ్ళి చేయాలనుకుంటున్నాను" అన్నాడు.

ఆ మాటలకు కాంతిసేన తలదించుకుని "నాన్నా నాకు పెళ్ళి ఇష్టం లేదు. సన్యాసినిగా మారి దేవుని సేవ చేసుకోవాలనుకుంటున్నాను" అని చెప్పింది.

తండ్రి ఆశ్చర్యపోయి అలాంటి నిర్ణయం తగదని వెయ్యివిధాల చెప్పాడు. కాంతిసేన వినలేదు. వెళ్ళి సన్యాసినుల మఠంలో చేరింది. ఆ మఠం నిర్వాహకురాలిని రాజు పిలిపించి "కాంతిసేనను అష్టకష్టాలు పెట్టండి. సన్యాసిని జీవితానికి ఆమె భయపడి తిరిగి రాజభవనాన్ని చేరుకోవాలి" అని ఆజ్ఞాపించాడు.

మఠంలో కాంతిసేనను ఎన్నోరకాలుగా బాధించారు. నీళ్ళు తోడించారు. వంద మందికి వంట చేయించారు. బండెడు బట్టలు ఉతికించారు. అన్నింటిని ఓర్పుతో కాంతిసేన ఆచరించింది. దైవస్మరణతో కష్టాల్ని మరిచిపోయేది.

నెల రోజుల తర్వాత కాంతిసేనని రాజు పిలిపించాడు. బక్కచిక్కిపోయిన కూతుర్ని చూసి రాజుకి దు:ఖమొచ్చింది. " ఏమ్మా ఇప్పటికైనా నా మాటవిని పెళ్ళి చేసుకో" అన్నాడు కన్నీళ్లని ఆపుకుంటూ.

"నాన్నా, నేను అడిగిన రెండు కోర్కెలు తీరుస్తావా?" అని అడిగింది కాంతిసేన.

> "ఎవరైనా సరే తమ రెండు కళ్ళను పెకలించి ఇస్తే ఆ రక్తంతో తయారైన లేపనంతో రాజుగారి వ్యాధి నయమవుతుంది" అన్నాడు సన్యాసి.

"నేను మహారాజుని. నా వల్ల కానిదంటూ ఈ లోకంలో లేదు" గర్వంగా అన్నాడు రాజు.

"మొదటి కోర్కె నాకు ముసలితనం రాకూడదు. రెండు నాకు చావు రానేకూడదు" అని అడిగింది కాంతిసేన.

మహారాజుకి తీవ్రమైన ఆగ్రహమొచ్చింది. "నన్ను అవమానించడానికే నువ్వు ఇలాంటి కోర్కెలు కోరుతున్నావ్" అన్నాడు.

"నువ్వు మహారాజువి కదా నాన్నా, నీ వల్లకానిది ఈ లోకంలోనే లేదుగా" అంది కాంతిసేన.

మహారాజు కోపం కట్టలు తెంచుకుంది. "మహారాజునే అవమానించిన ఈ పాతకి తల నరకండి" అని ఆజ్ఞాపించాడు. వలదని మహారాణి వారించినా రాజు మనసు మారలేదు.

వధ్యశిలకి కాంతిసేనని తీసుకెళ్ళారు. శిలపై ఆమె శిరస్సు ఆనించి తలారి కత్తి పైకెత్తాడు. అంతా ఒక్క క్షణం ఊపిరి బిగపట్టారు. కత్తి శిరస్సుని తాకింది. ఆశ్చర్యంగా కత్తి విరిగిపోయింది. మహారాజు ఆగ్రహం పెరిగింది. కాంతిసేన గొంతుకి ఉరి బిగించమని చెప్పాడు. ఆమె గొంతుకి తాడు బిగుసుకుంది. గుడ్లు తేలవేసి పడిపోయింది.

ఇంతలో ఉరుము ఉరిమినట్టు సింహగర్జన వినిపించింది. మహాకాయంతో వున్న ఒక సింహం అక్కడ ప్రత్యక్షమై కాంతిసేనను ఒక బొమ్మలాగా నోటితో కరుచుకుని వెళ్ళిపోయింది. తరువాత కాంతిసేన ఏమైందో ఎవరికీ తెలియలేదు.

ఏడాది గడిచింది. రాజ్యమంతటా కరువు. చినుకు రాలలేదు. ప్రజలు అలమటిస్తున్నారు. ఆకలితో రాలిపోతున్నారు. మహారాజు ఆరోగ్యం క్షీణించింది. శరీరాన్ని ఏదో చర్మవ్యాధి తినేస్తోంది. ఎందరో వైద్యులు చూశారు. పెదవి విరిచారు.

ఒకరోజు ఒక సన్యాసి రాజభవనంలో ప్రవేశించాడు. రాజుగారి వ్యాధిని తాను నయం చేస్తానని ప్రకటించాడు. రాజుగారి కళ్ళు మిలమిలా మెరిసాయి. అయితే ఒక్క షరతు అన్నాడు సన్యాసి. ఏమిటన్నట్టు సన్యాసి వైపు రాజు చూశాడు.

" ఎవరైనా సరే తమ రెండు కళ్ళను పెకలించి ఇస్తే ఆ రక్తంతో తయారైన లేపనంతో రాజుగారి వ్యాధి నయమవుతుంది" అన్నాడు సన్యాసి.

" ఓస్ అదెంత పని" అన్నాడు మహారాజు.

"అయితే ఒక్క మాట. ఆ కళ్ళను ఇచ్చే వాళ్ళు పూర్తి ఇష్టంతో ఇవ్వాలి" అన్నాడు సన్యాసి. రాజ్యమంతా దండోరా వేశారు.

నగరంలో ఒక్కరు కూడా తమ కళ్ళను ఇష్టపూర్వకంగా మహారాజుకి ఇవ్వడానికి ముందుకు రాలేదు. చివరికి మహారాణికి కూడా తాను గుడ్డితనం అనుభవించడం ఇష్టంలేదు. అల్లారుముద్దుగా పెంచిన పెద్ద కూతుళ్ళు తండ్రివైపు రావడానికి కూడా ఇష్టపడలేదు. సువిశాల సామ్రాజ్యంలో ఒక్కరంటే ఒక్కరు కూడా మహారాజు కోసం ముందుకి రాలేదు.

నేత్రదాతలకోసం ఎక్కడెక్కడో సైనికులు వెతుకుతున్నారు. చివరికి ఒక జలపాతం కింద ఒక గుడిసె కనిపించింది. జలపాతంతో తడుస్తున్నా చుక్కనీరు గుడిసెలోకి రావడం లేదు. అక్కడ ఒక మ్మాయి ధ్యానం చేస్తూ కనిపించింది. సైనికులు అక్కడికెళ్ళి విషయం చెప్పారు. ఆ అమ్మాయి మారు మాటాడకుండా తన కళ్ళను తీసి ఇచ్చింది. ఆకుదొన్నెల్లో ఆ రక్తాన్ని తీసుకెళ్ళి సన్యాసికి ఇచ్చారు. అతను లేపనం తయారుచేసి మహారాజుకి పూశాడు. మహారాజు వ్యాధి నయమైంది. అయితే మహారాజు సంతోషపడలేదు. వెక్కివెక్కి ఏడ్చాడు. రాజ్యాన్ని పాలించే రాజు. ఎప్పుడూ గంభీరంగా ఆజ్ఞలు జారీ చేసే రాజు. పసిపిల్లవాడి కంటే అన్యాయంగా రోదించాడు.


" కళ్ళు ఇచ్చిన వ్యక్తిని తనకు చూపించమని" వెక్కిళ్ళ మధ్య అడిగాడు.

మహారాజుని జలపాతం దగ్గరికి తీసుకెళ్ళారు. అక్కడ ధ్యానం చేస్తున్న అంధురాలిని చూసి మహారాజు గుండె పగిలిపోయింది. ఆమె కాంతిసేన. తన వల్ల అష్టకష్టాలు పడిన కూతురు.

"నాకోసం నీ లోకాన్ని చీకటి చేసుకున్నావా తల్లీ" అన్నాడు.

"నాకు లోకమంతా కనిపిస్తూనే వుంది తండ్రీ. మనోనేత్రంతో అంతా చూడగలుగుతున్నాను. అహంకారానికి మించిన అంధత్వం వుంటుందా నాన్నా" అంది కాంతిసేన.

ఆమె గొంతులో దయని తట్టుకునే శక్తి మహారాజుకి లేకుండా పోయింది. "నన్ను క్షమించు తల్లీ" అంటూ సాగిలపడ్డాడు. మహారాజు కళ్ళు కన్నీటి జలపాతాలయ్యాయి. మళ్ళీ రాజ్యంలో వాన కురిసింది.




## మడ్డి

అమెరికా చేరుకోగానే
వాళ్ళు నన్నొక పాతకాలపు హోటల్లో
దించారు
స్ట్రీట్ నం. 52, రూమ్ నం. 41
రూమ్‌కి వెళ్ళగానే
తలుపు మూసి
బాత్‌రూమ్‌కి వెళ్ళాను
పంపు తిప్పగానే
బుష్‌మంటూ పెద్దచప్పుడుతో
నీళ్ళు ధారగా వచ్చాయి
ఎర్రటి నీళ్ళు – మడ్డి – తుప్పు
గొట్టాలు తుప్పుపట్టాయి
చాలసేపు వేచి వున్నాను
నీళ్ళు తేరుకుంటాయని
ఇంకా ఎదురుచూస్తూనే వున్నాను

ఇంగ్లీషు: ఎ.కె. రామానుజన్
అనుసరణ: రామమోహన్‌రాయ్